నాటి విధానాలు.. నేటి ఫలితాలు

- పదిలో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- గత ప్రభుత్వంలో నాడు-నేడుతో మెరుగైన సౌకర్యాలు, బోధన
- నాటి నిర్ణయాలతో మెరుగైన ఫలితాలు

అవుకు: ఇటీవల వెలువడిన పది పరీక్ష ఫలితాల్లో బనగానపల్లె నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధించాయి. ప్రతి పాఠశాలలోనూ 500 మార్కులు దాటిన విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వం నాడు-నేడు ద్వారా సర్కారు బడులపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయడమే ఇందుకు ప్రధాన కారణంగా తల్లిదండ్రులు, విశ్లేషకులు అంటున్నారు. ప్రతి విద్యార్థికి అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు జగనన్న విద్యా కానుక ద్వారా పిల్లలకు అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, షూలు, బ్యాగ్, ఇలా వారికి అవసరమైన ప్రతి ఒక్కటీ సమకూర్చారు. అలాగే పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన, మెరుగుపడిన సౌకర్యాల కారణంగానే విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి సర్కారు బడుల సత్తా చూపించారు. 2023 సంవత్సరంలో అవుకు ఆదర్శ పాఠశాలలో చదివిన షేక్ మహమ్మద్ సమీర్ 590 మార్కులు సాధించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో కోవెలకుంట్ల మండలం 78.11 శాతం, అవుకు 73 శాతం, సంజామల 71శాతం, కొలిమిగుండ్ల 70శాతం, బనగానపల్లె 64.05శాతం ఉత్తీర్ణత సాధించారు.

పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట

గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో పాఠశాలల రూపురేఖలు మారాయి. కోట్లు ఖర్చు పెట్టి సర్కారు బడులను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల వైపు పిల్లల తల్లిదండ్రులు మక్కువ చూపారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఫేజ్-1 ద్వారా అవుకు మండంలోని 19 పాఠశాలలకు రూ.2.30 కోట్లు, బనగానపల్లె మండంలోని 27 పాఠశాలలకు రూ.8.20 కోట్లు, కోవెలకుంట్ల మండలంలోని 13 పాఠశాలలకు రూ.3.04 కోట్లు, కొలిమిగుండ్ల మండలంలోని 17 పాఠశాలలకు 1.78 కోట్లు, సంజామల మండలంలోని 12 పాఠశాలలకు రూ.1.67 కోట్లు నిధులతో అభివృద్ధి చేశారు. ఫేజ్-2 ద్వారా 165 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి రూ.58.94 కోట్ల నిధులను మంజూరు చేశారు. ప్రభుత్వ మారడంతో పనులు సగంలో నిలిచిపోయాయి.



గత ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ స్కూళ్లను తలపించేలా నిర్మించిన అవుకు ఆదర్శ పాఠశాల

నియోజకవర్గంలోని ప్రభుత్వ బడుల్లో పది ఫలితాలు ఇలా..

మండలం	పాఠశాల	ఉత్తీర్ణత శాతం	విద్యార్థి	అత్యధిక మార్కులు
అవుకు	ఆదర్శ పాఠశాల	73	పి.రాకేష్	583
కోవెలకుంట్ల	కోవెలకుంట్ల ఉన్నత పాఠశాల	78.11	ఉసేన్ బాషా	589
సంజామల	నొస్సం ఉన్నత పాఠశాల	71	సల్మా, వైష్ణవి	584, 584
కొలిమిగుండ్ల	అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల	70	మనీషా	575
బనగానపల్లె	బాలికల ఉన్నత పాఠశాల	64.05	షణ్ముఖ	579

ఈ ఫలితాలు నాడు-నేడు ఫలితమే



నేను చదువునే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు ఉండేవి కావు. ప్రభుత్వ విద్యార్థి 500 మార్కులు సాధించారంటే అది గగనం. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు.ప్రైవేటు పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోకుండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పడుతున్నారు. దీనికి కారణం గత ప్రభుత్వంలో నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన అభివృద్ధే. దీని ఫలితంగానే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగుపడుతున్నారు.

-పి.వెంకట శివుడు, పూర్వ విద్యార్థి, అవుకు

ఊహించని ఫలితాలు



గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన మార్పుల వల్ల ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఊహించని ఫలితాలు వచ్చాయి. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చి వేశారు. కార్పొరేట్ స్థాయికి మించి సౌకర్యాలు, వసతులు, విద్యాబోధనలో మార్పులు వంటి సంస్కరణలు చేయడం వల్ల నేడు ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి.

-పురుషోత్తం నాయుడు, కునుకుంట్ల గ్రామం

క్లుప్తంగా

మారెమ్మ ఆలయానికి గోవు దానం



ఆవుతో కమిటీ సభ్యులు

కోవెలకుంట్ల: స్థానిక అంకాలమ్మ చౌరస్తాలో ఉన్న మారెమ్మ ఆలయానికి అవుకు మండలం కాశీపురానికి చెందిన నార్ల మహేశ్వరరెడ్డి శనివారం గోవును దానంగా ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సాయంగా రూ.40 వేలు విలువ చేసే ఆవును ఇవ్వగా పట్టణానికి చెందిన యాదాటి పుల్లయ్య ఆవును తోలుకుని వచ్చి ఆలయ కమిటీకి అప్పగించారు. ఆవు సంతతి ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామని కమిటీ సభ్యులు ఉసేనప్ప, మైకేల్, లింగన్న, శిలువయ్య పేర్కొన్నారు. .

నేడు మంగపల్లెలో వైద్య శిబిరం

సంజామల: మండల పరిధిలోని మంగపల్లె గ్రామంలో పెద్దిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి తెలిపారు. ఊపిరితిత్తులు, షుగర్, బీపీ, గుండె, కంటి, చర్మ తదితర వ్యాధులకు సంబంధి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవినీతి యంత్రాంగం.. మత్తులో యువతరం



కంబాలపాడు సర్కిల్‌లోని బెల్టుషాపు

డోన్: డోన్ ఎక్సైజ్ పరిధిలో ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు దర్శనమిస్తున్నాయి. మద్యం దుకాణ యజమానులు ఒక్కో గ్రామంలో మూడు నుంచి నాలుగు వరకు బెల్టుషాపులను ఏర్పాటు చేశారు. ఇందుకు గానూ ఒక్కో బెల్టుషాపుదారుని నుంచి రూ.10 వేల చొప్పున వసూలు చేశారు. దీనికి తోడు ప్రతి నెలా బెల్టుషాపు నుంచి రూ.4వేలు ఎక్సైజ్‌శాఖ అధికారికి ఇవ్వాల్సి ఉంటుంది. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండడంతో నియోజకవర్గంలోని 178 గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులతో వేధింపులు

ఎక్కడ పడితే అక్కడ మద్యం విక్రయించేందుకు అవకాశం కల్పించిన ప్రభుత్వం డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింక్ పేరుతో తాగుబోతులకు భారీ జరిమానా విధిస్తోంది. ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి 12 గంటల వరకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తాగుబోతుల జేబులను గుల్ల చేస్తున్నారు. అయితే బెల్టుషాపుల జోలికి మాత్రం వెళ్లడం లేదు.



తారకరామనగర్‌లో ఇంటి ఎదుట తప్పతాగి పడిపోయిన యువకుడు

రోడ్లపైనే ధాన్యం.. డ్రైవరన్నా జరభద్రం



కోవెలకుంట్ల- జమ్మలమడుగు రహదారిలోని గుళ్లదూర్తి వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటల ఉత్పత్తులు చేతికందడంతో రైతులు దిగుబడులను ఆరబెట్టుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాల పరిధిలో కుందూనది పరివాహక ప్రాంతంలో విస్తారంగా వరి, మొక్కజొన్న, మిరప పంటలు సాగు చేశారు. వరిలో కోత, నూర్పిడి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మొక్కజొన్నలో నూర్పిడి పనులు చివరి దశకు, మిరపలో చివరికోత పనులు కొనసాగుతున్నాయి. కోవెలకుంట్ల- జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారి వెంట వివిధ గ్రామాల రైతులు ఆయా పంటల దిగుబడులను ఆరబెట్టుకున్నారు. ప్రధాన రహదారిపైనే ఒక వైపున రాశులుగా పోశారు. రాత్రి సమయాల్లో వాహన చోదకులు ఈ ప్రాంతాల్లో ప్రమాదం పొంచి ఉంది. పంట ఉత్పత్తులు రోడ్డుపైన ఉన్న విషయాన్ని గమనించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరగనున్నాయి. దిగుబడులు ఆరబోసిన ప్రాంతంలో వాహనాలు ఎదురుపడితే జాగ్రత్తలు తీసుకోకపోతే వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటు చేసుకునే అస్కారం ఉంది.

– కోవెలకుంట్ల

ముమ్మర తనిఖీలు

డోన్ టౌన్: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డోన్‌లోని పలు ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు. పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా ఆధ్వర్యంలో పార్శిల్, కొరియర్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. యజమానులకు పలు సూచనలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పార్శిళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని.. అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని.. తద్వారా ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుందని సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని టాక్సీ డ్రైవర్లు, ప్రజలకు హెల్మెట్ వల్ల కలిగే ఉపయోగాలు, ఆవశ్యకత, ట్రాఫిక్ రూల్స్, డ్రంకన్ అండ్ డ్రైవ్, అతి వేగం తదితర విషయాలపై అవగాహన కల్పించారు.



డోన్ ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో పార్శిల్ సర్వీసులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

లాడ్జీల్లో తనిఖీలు

బేతంచెర్ల: పట్టణంలోని ప్రధాన రహదారి వెంట వాహనాలు, లాడ్జీలను సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ తిరుపాలు పోలీస్ సిబ్బందితో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రతా చర్యల్లో భాగంగా కర్నూలు, నంద్యాల క్రాస్ రోడ్డులో వాహనాలు, లాడ్జీలను తనిఖీ చేసి యజమానులకు పలు సూచనలు చేశారు. అనుమానితులు ఉంటే వెంటనే సమాచారం అందించాలని కోరారు.



బేతంచెర్లలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ



పట్టణంలో లాడ్జీలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆది శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు



ఆదిశంకరాచార్యుల విగ్రహం



దుస్తులను పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు

డోన్ టౌన్: స్థానిక గాయత్రి పీఠంలో శనివారం వేదమాత బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జగద్గురువులు శ్రీఆదిశంకరాచార్యుల విగ్రహానికి శతవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ, అన్నపూర్ణమ్మ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో మరణించిన వారిని గుర్తు చేసుకుంటూ 2 నిమిషాల మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఇటీవల వెలవడిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు అభినందిస్తూ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సంఘంలోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉగ్రదాడిలో మృతులకు నివాళులర్పించేందుకు వేదమాత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నారు. పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేయనున్నారు.

డీఎస్సీలో నిబంధనలు తొలగించాలి

కోవెలకుంట్ల: మెగా డీఎస్సీకి ఆటంకంగా ఉన్న నిబంధనలను తొలగించాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత డీఎస్సీకి పలు నిబంధనలు విధించడం సరికాదన్నారు. గతంలో డీఎస్సీకి డిగ్రీలో 40 శాతం మార్కులుంటే అర్హులని, ఈ డీఎస్సీకి 45 శాతం ఉండాలని నిబంధన పెట్టడం విడ్డూరమన్నారు. గతంలో ఉద్యోగం వచ్చిన తర్వాత అభ్యర్థులు విద్యార్హతతో పాటు వివిధ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం సమర్పించేవారన్నారు. ప్రస్తుతం డీఎస్సీకి ముందే సమర్పించాలని నిబంధన విధించడం సరికాదన్నారు. ఈ నిబంధనలను సడలించడంతోపాటు దివ్యాంగులకు మెగా డీఎస్సీలో కేటాయించిన పోస్టుల వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

కొర్రసాగు.. దిగుబడులపై ఆశలు



గుళ్లదూర్తి సమీపంలో సాగైన కొర్ర

కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది ఎండకారు(రబీసీజన్ చివరిపంట) పంటగా సాగు చేసిన కొర్ర దిగుబడులపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలోని కుందూనది, పాలేరు, కుందరవాగులు, తదితర సాగునీటి వనరుల ఆధారంగా కొర్ర సాగు చేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 5వేల వరకు వెచ్చించారు. వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడులు వచ్చే సూచనలున్నాయి. ప్రస్తుతం పైరు కోత దశలో ఉండగా ఎకరాకు 7–8 క్వింటాళ్ల దిగుబడులు వచ్చే అవకాశం ఉండడంతో రైతులు ఊరట చెందుతున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో క్వింటా రూ. 2500 వరకు ధర పలుకుతుండటంతో పెట్టుబడులు పోనూ ఆదాయం చేకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు.

-కోవెలకుంట్ల

కల్యాణం.. కమనీయం



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న పండితులు

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామికి మాసశివరాత్రి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం శివపార్వతులకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ, మహా మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం ఆలయ ఆవరణలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను కొలువుంచి వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాల్మన్

సంజామల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పోచ రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు చకచక నివేదికలు చదివి వినిపించారు. వైద్య, ఆరోగ్య శాఖ, ఉద్యానవన శాఖ, సాంఘిక సంక్షేమ, వసతి గృహ నిర్వహణ శాఖ, సాగునీటి శాఖ అధికారులు హాజరుకాలేదు. సమస్యల ప్రస్తావన తూతు మంత్రంగా వినిపించారు. పలు గ్రామాల్లో కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సర్పంచ్‌లు కోరారు. స్పందించిన ఏఈ త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ అనీల్ కుమార్, ఈఓఆర్డీ రాధిక రెడ్డి, వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు రమాదేవి, చిన్న వెంకటయ్య, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు

ట్రాక్టర్‌ను ఢీకొన్న సిమెంట్ ట్యాంకర్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని రాఘవరాజుపల్లె ప్రధాన రహదారిలో శనివారం తెల్లవారుజామున ట్రాక్టర్‌ను సిమెంట్ ట్యాంకర్ ఢీకొంది. బెలుం వైపు నుంచి నాపరాళ్ల లోడుతో ట్రాక్టర్ వెళుతోంది. అదే సమయంలో సిమెంట్ ట్యాంకర్ వెనుక నుంచి ఢీకొనడంతో నాపరాళ్లు పగిలిపోయాయి. ట్రాలీపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్యాంకర్ ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. .



బేతంచెర్లలో కొవ్వొత్తులతో నిరసన



డోన్: గాంధీ విగ్రహం వద్ద మృతులకు నివాళి

ఉగ్రవాదాన్ని అంతం చేయాలి



బనగానపల్లెలో నిరసన ర్యాలీ

బనగానపల్లె రూరల్: జమ్మూకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని బలితీసుకున్న తీవ్రవాదులను కఠినంగా శిక్షించాలని విశ్వ హిందూపరిషత్, సమరసతసేవా ఫౌండేషన్, రాష్ట్రీయ స్వయం సేవక్ సహా వివిధ ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రదాడికి నిరసనగా మృతుల ఆత్మకు శాంతి కలిగేలా పట్టణంలో శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవస్థానం నుంచి పొట్టి శ్రీరాములు సర్కిల్, పాత బస్టాండ్, మెయిన్‌బజారు మీదుగా పెట్రోల్ బంకు కూడలి వరకు ర్యాలీ సాగింది. ర్యాలీకి సంఘీభావంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పాల్గొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ర్యాలీ

డోన్ టౌన్: ఉగ్రవాదులను ఏరిపారేయాలని డోన్ ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం నాయకులు అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శనివారం రాత్రి స్థానిక కార్యాలయం నుంచి పాతబస్టాండ్, గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. రెండు నిమిషాల మౌనం పాటించారు. ఏజెంట్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, ప్రసాద్, ప్రకాష్, ఏజెంట్లు పాల్గొన్నారు.

పర్యాటకులపై దాడి అమానుషం

బేతంచెర్ల: పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని మత సామరస్య చైతన్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నూర్ అమ్మద్, మహ్మద్ గౌస్, మారుతి శర్మ, నాగ మోహన్, గూని నాగరాజు అన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉగ్రవాదుల హత్యాకాండకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించారు. దేశంలోని హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టేందుకు పాకిస్తాన్ దురుద్దేశంతోనే ఉగ్రవాదులతో ఈ దుశ్చర్యకు పాల్పడిందన్నారు. ఉగ్రవాదం నశించాలని, భారత దేశ శాంతి వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలోని వార్డుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చోట్ల పైప్‌లైన్ పనులు చేపట్టి ప్రజలకు తాగునీరు అందించాలని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ హరి ప్రసాద్ ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో వార్డు కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయా కాలనీల్లో నూతనంగా వేసే పైపులైన్లతో పాటు, అర్బన్ హెల్త్ సెంటర్లలో సౌకర్యాలు , సంపుల నిర్మాణం వద్ద త్రిఫేస్ లైన్ల ఏర్పాటు, అవసరమైన చోట్ల మరమ్మతులకు గురైన మోటర్ల రిపేరుకు సంబంధించి సుమారు రూ. 1.65 కోట్ల నిధులు ఖర్చు చేయడానికి వార్డు సభ్యుల అమోదంతో తీర్మాణం చేశారు. సుమారు 62 మంది నీటి కొళాయి కనెక్షన్ల కోసం డీడీలు చెల్లించారని.. ఇంత వరకు కనెక్షన్లు ఇవ్వలేదని పలువురు తెలిపారు. నగర పంచాయతీ సిబ్బందికి పెండింగ్ జీతాలు ఇవ్వాలని కో ఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య అన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. అలాగే పట్టణ ప్రజలు ఇంటి, పరిశ్రమల పన్నులు ఈనెల 30 తేదీలోగా చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. చలంరెడ్డి మాట్లాడుతూ.. నగర పంచాయతీకి రోజుకు 50 లక్షల లీటర్ల నీరు అవసరం అన్నారు. అమృత్-2.0 పనులు ప్రారంభమయ్యే వరకు గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా వచ్చే నీటిని ప్రస్తుతం ఉన్న సంపుల దగ్గర అదనంగా పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తే ప్రజలకు వేసవి ముగిసేంత వరకు తాగునీటి సమస్య తలెత్తదన్నారు. పట్టణ ప్రజలు తాగునీటిని వృథా చేయవద్దని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్స్ షేక్ ముబీనా, హుసేన్‌బీ, యంగమ్మ, నాగజ్యోతి, ఇబ్రహీమ్, మధు, అంజి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: నల్లమేకలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం కొత్త బ్రేకర్ నిర్మాణ పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డి.రంగాపురం, జక్కసాని కుంట్ల, రాచవాండ్లపల్లి ఫీడర్స్ పరిధిలోని గ్రామాలతో పాటు రాంపురం, మామిళ్లపల్లి తదితర గ్రామాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరపరా ఉండదని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు 12 గంటల నుంచి ఇస్తామని.. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

రేపటి నుంచి సమ్మర్ క్యాంప్

బేతంచెర్ల: పట్టణంలోని గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు సమ్మర్ ఓరియంటల్ ప్రోగ్రాం కింద కథల పుస్తకాలు చదివించడం, డ్రాయింగ్, క్యారమ్స్ ఆటల పోటీలు, కంప్యూటర్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రంథాలయ అధికారి మధు శేఖ ర్ తెలిపారు. పట్టణంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చాటే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.